

# మన ఇంట్లో... వెలిగే కోవెల!

**ఇల్లు చిన్నదైనా పెద్దదైనా, అద్దె ఇల్లయినా, సొంత ఇల్లయినా... ఉన్నంతలో మనతో పాటు భగవంతుడికి కూడా ఓ చోటు ఏర్పాటు చేసుకుంటాం. నచ్చిన దేవుణ్ని నిలుపుకొని రోజూ నమస్కారం చేసుకుంటాం. అందుకోసం ఇప్పుడు వస్తున్న మందిరాలు వెలుగు పూలు పూస్తున్నాయి. దేవుణ్ని పెట్టుకునే చోట భగవంతుడి రూపాలు లైట్ల వెలుగుల్లో మెరిసిపోతున్నాయి. ఇల్యుమినేటెడ్ మందిరాలు ఇంటి అలంకరణలోనూ భాగమవుతున్నాయి.**







ఇప్పుడంతా హంగులదే హవా. ఒంటి సోకు ఉంటే చాలదు, ఇంటి సోకూ ఉండాలని పెద్దలు చెప్పినట్టు.. మనమెంత బాగా ముస్తాబవుతామో ఇంటినీ అంతే అందంగా అలంకరించుకోవాలన్న పోకడ అధికం అవుతున్నది. అందులోనూ ఏ ఇంట్లో అయినా దేవుడి మందిరాన్ని ప్రత్యేకంగా నిర్మించుకుంటారు. లేదా తెచ్చి పెట్టుకుంటారు. ఎవరెవరి అభిరుచులకు తగ్గట్లు వాళ్లు దాన్ని తీర్చి దిద్దుకుంటారు. ఈ ప్రాధాన్యాన్ని గమనించే 'కోరియన్ త్రీడీ ఇల్యుమినేటెడ్ మందిరాల'ను తయారు చేస్తున్నారు ఇంటీరియర్ డిజైనర్లు. గృహాలంకరణకు వన్నె తెచ్చేలా రూపొందుతున్నాయివి.

**విభిన్న రకాలు..**

కోరియన్ అనే ఒక ప్రత్యేకమైన మెటీరియల్‌తో ఈ వెలిగే కోవెలలను తయారు చేస్తున్నారు. మనం కబోర్డులకు చేయించుకునే షీట్ల తరహాలో మరింత గట్టిగా మన్నికగా ఉంటాయివి. ఇందులో రాముడు, గణపతి, వేంకటేశ్వరుడు, లక్ష్మి, శివపార్వతులు.. ఇలా రకరకాల దేవతా రూపాలను త్రీడీ ఆకృతిలో మలిచి వెనకవైపు లైట్లు బిగిస్తారు. ఇందులో కేవలం బంగారు రంగు వెలుగుల్లో కనిపించేవి ఒక తరహావి. మరో రకంలో.. రంగురంగుల్లో ఉండే దేవుళ్ల ఫొటోలను మందిరం లోపలి గోడమీద ముద్రిస్తారు. కాంతిని బాగా ప్రసరింపజేసే అలబాస్టర్ అనే మరో ప్రత్యేకమైన షీట్‌ను దీని వెనుక భాగంలో అమరుస్తారు. అక్కడా లైట్లు ఉంచడం వల్ల దేవతా రూపాలు వెలుగుతూ త్రీడీ తరహాలో కనిపిస్తాయి. మందిరం చుట్టూ ఉండే స్తంభాల్లాంటి నిర్మాణాల్లోనూ బల్బులు ఉంటాయి. అవసరాన్ని బట్టి వీటిని వేసి, తీయొచ్చు. హరే రామ, జై శ్రీరామ్, రాధేశ్యామ్, ఓం నమఃశివాయ, శ్రీమాత్రేనమః.. లాంటి మంత్రాలూ కాంతిమంతంగా కనిపిస్తున్నాయి. ట్రెడిషనల్, మోడ్రన్ డిజైన్ల మేలు కలయికగా ఈ చిట్టి గుళ్లు ఇంట్లో కొలువుదీరుతున్నాయి. పూజ గదికి దీపకాంతికి తోడు విద్యుల్లతల కాంతులనూ తెచ్చిపెడుతున్నాయి. ఈ పండుగ సీజన్‌లో మీ ఇంటి కోవెలనూ అందంగా ముస్తాబు చేసుకోండి. ■











